# నారిగాడి సోది





ఇష్టం లేని వాళ్ళకి ఇది సోదే మరి. ఇష్టం ఉన్నవాళ్ళకి ఇది సోదైనా పరవాలేదు.

రమానాథ్ కందాళ

## కవ్వా ముక్కూ సే వాటర్పీతా హై..

రావిసెట్టుకాడికి రావల్సినోళ్ళు నలుగురూ టంచన్ గా ఎలిపొచ్చి కూకొన్నరు. నాదేనూ ఆలీసెం. గబగబా ఎల్లి గొంతు సర్దుకోని ఇలగ సెప్పడం మొదలెట్టినాను.

ఈ మజ్జిని  సిమ్హాద్రి మావ తన సిన్నప్పటి పెండు వరహాల్రావనీసోడున్నాడని, ఆడవెరికా ఎల్తన్నడనీ, సూడ్డానికనీసి మా వూరొచ్చేడు. వొచ్చి, వరాహాల్రావు గురించడిగితే ఇంకా ఎన్నో చెప్పి ఇలకన్నాడా అన్నాడు.

"వరహాల్రావు మా గొప్పోడ్డే సిన్నప్పుడు మా బడి హోలు మొత్తమ్మీద ఆడి గురించి తెలియనోడుండీ వోడు కాదు. సంగతేటంటే వరహాల్రావుకి హిందీ వొహంతటొచ్చేదీ కాదు, అలాగని మానీదీ కాదు. లొంగీ లొంగకుండా సెట్టుమీది బేతాలుడు ఇక్రమార్కుణ్ణెట్టినట్టు అదాణ్ణి నానా యాతనా ఎట్టేది. సిన్నప్పుడీణ్ణి క్లాసులో లేపి కద సెప్పమంటే.. ఈడు లెగిసి నించోని, సేతులు కట్టుకోని, "అనగా అనగా .. నేమో.. వో అడివిలోనేమో వో కాకుండీదీ.. దానికేమో.. వో రోజేమో.. ఏటయ్యిందంటేను.." అనీసి మొదలెట్టేడు. ఆడికి బాగా వొచ్చిందదొక్కటే కద మరి.

అంతా బానే వున్నాది. కాకపోతే సిక్కేటంటే, ఆ పిరీడు హిందీ పిరీడు. "హిందీ మే.. హిందీ మే.." అనీసి గట్టిగా డస్టరెట్టి బల్లమీద కొట్టి గదమాయించేడు మా హిందీ మేస్టరు. ఆ సప్పుడుకి ఈడు ముందు గతుక్కుమన్నా, ఎంటనే సర్దుకోని, గబగబా, "పురానే జమానే మే ... ఏక్ కవ్వా హోతా హై, ఏక్ దిన్ .. వుస్కవ్వా కో బహూత్ దాహవేస్తా హై. తబ్..వుస్నే .. తబ్..వుస్నే ..ఏక్ కుండా కో సూస్తా హై, కుండా మే వాటర్ హోతాహై కానీ బహూత్ అడుక్కీ హై.., కానీ కవ్వా కో.." అనీసి అప్పగించేసేడు గట్టుతెగిన గంగా నది లాగ. పెద్దానికీ 'హై' అనీసి సివర్లో ఎట్టేస్తే హిందీ అనీసే ఆడి నమ్మకం. అలగెలగవుద్ది? కాసాయం కట్టిన పెతీవోడు సన్నాసేనేటి ?. అసలసలే, ఆనవాలానవాలే.

హిందీ మేస్టరు గట్టిగా డస్టరెట్టి బల్లమీద మళ్ళీ కొట్టి "హిందీ మే బోల్నా..హిందీమే.." అన్నాడు. డస్టరు దెబ్బకి ఈడికి  మేస్టరేటంటన్నడో తెలిసింది కాదు. డస్టరెట్టి కొట్టీసరికల్లా, ఇంకో కద లంకించుకోమనీసో ఏటో అనీసి, "పురానే జమానే మే ఏమో.. ఏక్ కుందేలూ హోతా హై.. వుస్నే ఏక్ తాబేలూ సే..", అంటూ సరీగా

రానిదోటి మొదలెట్టేడు. హిందీకి హయ్యెలగో, మరి కదంటే పురానేజమానే లేకుండా అవదనీసి ఆడికి ఇంకో నమ్మకం. సుప్పన్నాడు హిందీ మేస్టరు.

అసలే మాయందరికీ ఆయన గోరంటే లాగుల్లో పడిపోయాది. ఇస్సుమూర్తి గోరికి సెంకం సెకరం ఎలగో, ఈయనగోరి కాడ కూడా ఎప్పుడూ వో డస్టరూ, వో బెత్తవూ వుండీవి. డస్టరు మల్టీపర్పసుగుండీది కానీ బెత్తానికి మటుకూ వొకటే పర్పసు.. మండలు వాచి పోయావి. ఇస్సుమూర్తికయితే సెకరం కుడి వైపే, సెంకం ఎడవ్వేపే. హిందీ మేస్టరు మాత్తరవూ సవియసాచి లాగ డస్టరూ, బెత్తవూ అటించిటూ, ఇటించటూ మార్చి మార్చి వుతికీసి వోడు..

హిందీ మేస్టరి సంగతి పక్కనెడితే, ఇస్సుమూర్తి గోరికయినా సెకరం, అమ్ములూ, గదా, కత్తీ.. ఇలగ ఇన్నీసి ఆయుదాలెందుకో?.. అనీసంటే వరహాల్రావు, "అమ్మమ్మ.. అయి లేకుండగా ఎలక్కుదురుద్ది రా? అందరికీ వొహటే సిక్సేటి? కొందర్ని నరికీయాల్సుంటది, కొందర్ని పొడిచీయాల్సుంటది, మరికొందర్ని బాదీసి, మొత్తీయాల్సుంటది. అందుకనే ఇయన్నీను. ఎంతైనా సరే గదుందనుకో... గత్తో మొత్తీగలవు కానీ నరికీలేవు కద.. అలగే సెకరవెట్టి నరికీ గలవు కాని పొడిసీ లేవు కద.. అయినా సాస్తుర్లు గోరు సెప్పినట్టు, దేవుడి ఇసయంలో నోరు తెరిసీది కోరుకోడానికి తప్ప కొశ్నెల్లెయ్యడానిక్కాదు." అనీవోడు..

మొత్తానికి వరహాల్రావు ఆయేల నక్కన్తొక్కొచ్చినట్టే. గోడ కురిసీతో సరిపెట్టుకున్నాడు హిందీ మేస్టరు.

హిందీ రాలేదంటే వరహాల్రావునే తప్పు పట్టి నాబం నేదు. ఆడిక్కొంచెం మామ్మూలుగా కంగారెక్కువేను. మరి హిందీకి ముందే ఇంగిలీసు పిరీ డొచ్చీది, దానికి ముందే తెలుగు పిరీడుండీది. గూడ్సు పెట్టెల్లాగ అయి వొహ దాన్తరవాత వొహటి వరసగా వొచ్చీసరికి ఈడికి తెక్కంగారుగుండీది.

ఈడి కంగారుకి తోడు మా ఇంగిలీసు మేస్ట రొకడు. బాస కాడికొచ్చీసరికి ఈయన గోరు హిందీ మేస్టరికన్నా వో రెండాకులు ఎక్కువ సదివినోడే కాకపోతే ఈయన కలాసులో మటుకూ అరిసేతికీ, మండకీ మామూలుగా చాయస్సుండీది. ఎవుడైనా పిరీడుకి లేటుగొచ్చినా పర్లేదు కానీ, వచ్చినోడు మటుకూ క్లాసు గుమ్మం కాడాగి, "మయికమిన్సీచర్" అనీసి మరియాదగా అనకపోతే మాత్తరవు మండలే మండలు.

వరహాల్రావు అయన్నీ బానే సేసీవోడు. ఎటెండెన్స్ కొచ్చీసరికి మటుకూ, కొంతమందేమో "ప్రెజెన్సార్" అనడం, మరి కొంతమంది "ఎస్సార్" అనడం ఇనీటప్పటికి, తికమకపడిపోయి ఈడి పేరొచ్చీసరికి, లెగిసి నించోని, జవాన్లా సెల్యూటు కొట్టి, గట్టిగా "ప్రెస్సార్" అనరిసీవోడు,. అందరవూ కిసుక్కుమనీ వొళ్ళం మేస్టరికి కనబడకుండగా. ఇంగిలీసు పిరీడప్పుడు ఇంగిలీసే మాటాడాల మటుకూ. నోటాంట వొక్క తెలుగు ముక్కొచ్చిందనుకో.. స్టాండప్పాందీబెంచేను ..వొంటికాలిమీద.

అలగుండేది ఇంగిలీసుకీ, హిందీకీ అయితేను!

అదెలగున్నా, ఇసాపట్నం లైటుహావుసు లాటిది వరహాల్రావు నెత్తిమీదుండేదో ఏటోగానీ, క్లాసులో ఈడెన్ని దోబూచులాడినా పెతీ మేస్టరికీ కచ్చితంగా కనబడిపోయాదీడి బుర్ర, బూతద్దంలో సూపెట్టినట్టు..

వో సారి ఇంగిలీసు మేస్టరీణ్ణి లేపి "మాటాడ్డవొస్తాది, ఇయాల లెగిసిన కాడి నుండీ స్కూలుకొచ్చేదాకా ఏటిసేసేవో ఇంగిలీసులో సెప్పరా." అనీసి తెలుగు లో అన్నాడు, ఇంగిలీసులో అంటే మాకర్ధవవదనీసి.
ఈడు లెగిసి, కంగారు పడుతూ, "మార్నింగ్ మార్నింగ్.. ఐ లెగుస్.. .... అమ్మా గివ్ కాపీ తాగ్.. .. బుక్స్ టేక్. స్కూల్ టూ కమింగ్.. స్పీడ్ స్పీడ్ .. రన్నింగ్ రన్నింగ్.." అనీసి ఆగేడు. ఆడక్కడాపుండక పోతే మటుకూ మా పక్కలు పగిలిపోయావి నవ్వ లేక. ఏ కళనున్నాడో ఇంగిలీసు మేస్టరు మటుకూ "ఏట్రా అదీ..పెతీ పదానికీ సివర్లో పొల్లెట్టి, పోజుకొడితే ఇంగిలీసయిపోద్ది రా?.. ఎర్రి నాయాల." అనీసూరుకున్నడు.

ఇహ తెలుగు పిరీడయిందనుకో.. ఇంత తతంగ వుండేదే కాదు.!

క్లాసుగుమ్మం కాడికొచ్చి నిలబడి, తెలుగు పిరీడయినా సరే, మయికమిన్నీచరనీసే అనీవోళ్ళం అలవాటయిపోయి, కానీ "లోనకి ఎలిపోరావొచ్చా పంతులు గోరూ?" అనీవోళ్ళం కాదు. అనీవోళ్ళవే, కానీ అలగనమనీసి తెలుగు మేస్టరు నోరెట్టుకోని బలవంత పెట్టలేదు. అయినా నోటి బలవంత వొక్కటే వుంటే సరిపోద్దేటి? ఎంత పెజాసామ్యవైనా మరి రూళ్ళూ జవాన్లే కాదు, లాటీలు కూడా వున్నాయి కద.

మొత్తానికి తెలుగు మేస్టరి కాడ బెత్తవూ ఉండేదీ కాదు, తెలుక్కి బలవంతవూ ఉండేదీ కాదు. వున్నవల్లా పద్యెబాగవూ, గద్యెబాగవే. తెలుగు మేస్టరెముళ్ళాగూ, బాగాల్రెండూ యమకింకరుల్లాగూ వుండేవి వరహాల్రావుకి. "దున్నపోతొక్కటి తక్కువ కానీ, అది కూడా వున్నాదనుకో..నరకం నరకవంతా నడుసుకోనొచ్చినట్టే..." అనీవోడు.

సిత్రవేటంటే.. తెలుగు పిరీడు ఎంత నరకవైనా కానీ ఆ నరకవంటే వరహాల్రావుకి బయంగా మటుకూ వుండేది కాదు. మీదు మిక్కిలి మహా ఎటకారంగా వుండేది. ఇంగిలీసులోనూ, హిందీలోనూ పిల్లిపిల్లలా వుండేవోడు, తెలుగొచ్చేసరికి మటుకూ పెద్దపులైపోయేవోడు. ఇంగిలీసు మేస్టరి నోట్లో సిగిరెట్టు ఈడికి మహా ఇంపుగా వుండేది కానీ, తెలుగు మేస్టరి జోబీ లో పొడుంవు డబ్బా మూతేసున్నా సరే ఈడికి తెక్కంపు కొట్టీసేది.

ఈడికి తెలుగంటే ఎటకారవా, లేక తెలుగు మేస్టరంటే ఎటకారవా, లేక రెండూనా? అనీసి మాకు తెలిసేది కాదు. మరి మొదట మొదట్లో ఈడు "తెల్లవారెను కోడి కూసెను తెలుగు మేస్టరు పేడ కెళ్ళెను.. పేడ తెచ్చి

పిడకలెట్టెను." అనీసి పాడివోడు. పై కలాసుకెల్లీకొద్దీ "నజబజజ్జ బరనబ్బరవా, ఇబజనలన్నీ గజిబిజి కదరా" అనీసి కొత్త పాట మొదలెట్టేడు. ఎదైనా తెలిస్తేనే ఎటకారం. తెలియందాన్నేవనీసి ఎక్కిరిస్తావు?

పద్యెబాగంలో అయితే వో పాటంలో, తనకివ్వకుండా పారిజాతం పువ్వు రుకుమినికిచ్చీసేడని సత్యబావకి తెలిసి కోపం తో ఎలగ సిందులు తొక్కిందో గనాల్తప్పకుండా కవిగోరు వొర్నిస్తే, మాకు వెదురు గడ పట్టుకోని వొంటితాడు మీద గాల్లో ఆ కొసనుండి ఈ కొసకి కింద పడిపోకుండా నడిచీ సావుగరిడీ కుర్రోడు కనబడీవోడు. ఎందుకలగ నడవడం, సక్కగా నేల మీద నడుసుకుంటూ గబగబా ఈ కొసనుండి ఆ కొసకెలిపోచ్చుకదా అనీసంటే, నిజవేను ఎలిపోచ్చు. కానీ అది నువ్వూ నేనూ గుడ్లప్పగించి సూడ్డవెందుకు? ఎట్టుకున్నవైనా, ఎట్టినవైనా రూళ్ళున్న గేమాడ్డంలోనే వున్నాది మజాకా!
కానీ వరహాల్రావుకి ఆ మజాకా అక్కల్లేదు. "సత్యబావ కోపవెవడిక్కావాలయ్.. అదర్దం కావలంటే నేన్నానా అడ్డవైన రూళ్ళూ గుర్తెట్టుకోవాల. అంతెందుకు?.. మన బొంకుల్దిబ్బ కాడి కూరలదాందెగ్గిరికెల్లి, అత్తోటకూర కట్ట ముప్పవలా సెప్తే, ఐదు పైసలకిస్తావా అనీసడుగు.. అప్పుడు తెలుస్తాది ఆడదాని కోపవంటే ఏటో. అత్తెలుగుదా కాదా అనీసి నీకనుమానవొస్తాది. గనాల్లేకుండా పేనాల్తీసేస్తాది.." అనీవోడు వరహాల్రావ్. మొత్తానికి వరహాల్రావుకి కోపాన్ని కొలుచుకోడానికి వో కొలతున్నాది.

అలగే గద్యబాగంలో, దేవతలకి పారిజాత సెట్టెలగో, ఆంద్రావోళ్ళకి తాటిసెట్టలగ అనీసి వో పాటవుండీది. బాస కొద్దిగ కష్టంగున్నా అది సదివితే, రోజూ సూసీ ఎదవ తాటిసెట్టుకే ఇన్నుపయోగాలా అనిపించీది. వరహాల్రావు మటుకూ "డాబా ఇంట్లో పంకాలేసుకోని వుండీ వోడికి తాటాగ్గురించెందుకురా? అలగే.. తాటాగ్గుడిసెల్లోనే జీవితాలు గడిపీ వోళ్ళకి దానుపయోగం ఏరే నోరెట్టుకోని సెప్పలా ఏటి? ఎవుడికీ కాకపోతే ఇంకెందుకీ ఎదవ పాటం? వొకేల సెప్పినా మటుకూ సెప్పినోడిక్కూడా తిరిగి సదూకుంటే అర్దంకాని గ్రాందీకంలో సెపితే ఎలగ?" అనీవోడు. మరి మనసు లేనోడికి మార్గాలెతికి నువు సూపెట్టినా కనబడతాయేటి?

సిత్రవేటంటే తెలుక్కే కానీ ఇంగిలీసుకీ, హిందీకీ మటుకూ అర్దం కాకపోడవూ, కష్టంగా వుండడవూ వరహాల్రావుకి అడ్డొచ్చీది కాదు. అయి పట్టుబడని కొద్దీ ఈడికింకా పంతంగుండీది. ఎందుకురా అంత పంతవూ అంటే, "పనికొచ్చీ బాసకే కదేటి పంతాలు.. రవ్వంత కూడా పనికిరాంది సొంతబాసైతేనేటి .. సొంతూరైతేనేటి? సచ్చీ దాకా ఇంకెల పాలెం లోనే వుంటావనా? లకునో ఎల్తావో, లండనెల్తావో ఎవుడు సెప్పొచ్చేడు? అయినా ఏ బళ్ళోనో తెలుగు పంతులుజ్జోగానికి తప్ప తెలుగూ గిలుగూ ఎందుకనీసి?" అనీవోడు.

మొత్తానికి వరహాల్రావు కూడా అందర్లాగే పెరిగి పెద్దోడయ్యేడు. తెలుగ నచ్చనంత మాత్తరన అవకుండా ఆగిపోతాడేటి?

ఇరవైకే పెళ్ళీ, ఎంటనే కొడుకూ, కూతురూను. పెళ్ళిళ్ళు చేసేడు. ఆళ్ళకి పిల్లలు కూడాను. కూతురిక్కడే కానీ పెద్దోడు మటుకూ అవెరికా. ఈ మజ్జిని ఆడమ్మన్నడనీసి వో ఆర్నెల్లకి వరహాల్రావు అక్కడికెల్తాడనీసి కబురొచ్చింది. అందుకనీసి సూడ్డానికనీసి వొచ్చేను." అన్నాడు సిమ్మాద్రి మావ.

మర్నాడు నేనూ, మావా, సత్తిగోడూ వరహాల్రావింటికి పోయి కలిసేం జాగరత్తగెల్లి, తిరిగి జాగరత్తగెలిపోరమ్మనీసి సెప్పడానికి. వరహాల్రావు హాల్లో వున్నాడు.

అదీ ఇదీ అయింతరవాత, "మరవెరికా అంటే మజాకావా ఏటి?" అన్నాడు. అది పెశిన్లాగున్నా సమాదానం కోసవనీసేసిన పెశిన కాదేమో అనీసి నాకనిపించింది.. పైగా అవెరికా ఈజీకొల్టా మజాకా అనీసి మాగ్గుర్తున్నంత మట్టుకి మేవన్లేదు కూడాను. మరాడెందుకలగన్నడో.. కొన్ని పెశిన్లు సమాదానాలకోసవనీసి కాకుండగా వూరికే ఏస్తారనీసి, ఆటికింగిలీసులో ఏదో పేరుందనీసి తరవాత సత్తిగోడు నాకు సెప్పేడనుకో.
ఇంతలో వరహాల్రావు మనవరాలు, అయిదారేళ్ళదటొచ్చింది, నోట్లో ఏదో ఎట్టుకోని నాక్కుంటూ..

"ఏటే అదీ.." అన్నాడు వరహాల్రావు.

"లల్లీపప్పు" అందది.

"అత్తరవాత కానీ, ఇదిగో.. ముందు నీకొచ్చిన రైములో రెండు సెప్పు.." అన్నాడు.

"నేన్చెప్పు.." అందది తలడ్డంగా తిప్పుతూ.

"ఇంకో లల్లీ పప్పిస్తా సెపితే" అన్నాడు. ఎంటనే పప్పుకి బేరం కుదిరింది.

అది వరహాల్రావు వొళ్ళోకెక్కి, "టూ మాకెట్ టూ మాకెట్.. టూ బయ్యే పేట్ పిగ్ ..హోమేగేన్ హోమేగేన్.. దిగిటీ దిగ్.." అంది సివరి ముక్కక్కిందకి గెంతి. తరవాత "బాబా..బ్లాక్షీప్.." అనీసి ఇంకోటి సెప్పింది. దానికొచ్చిన ఇంగిలీసు మావకి రాకనో ఏటో మరి, "సీపూ, పిగ్గు తెలిసింది కానీ, మద్యెలో బాబాగోరి బజనేటా.. మొత్తానికి సంత గ్యేనం బానే వున్నాది పిల్లకి" అన్నాడు నా సెవిలో.

"..బలే..బలే..ఇంకోటి.. ..ఇంకోటి.." అన్నాడు వరహాల్రావు. తన్లోకంలో తనున్నాడు.

"ఇంకోటా...ఇచ్చీ బిచ్చీ పైడర్.." అన్తలాడించుకుంటూ ఏటో సెప్పింది.. అదేటో నాకు తెలీలేదు కానీ సూడ్డనికి బానే వున్నాది. సిన్న పిల్ల కదేటి ముద్దుగా వున్నాది ఏది సేసినాను.. అడిగితే ముద్దిచ్చింది కూడాను. సత్తిగోడికి మటుకూ ఏదో తెలిసినట్టున్నాది. తలాడించేడు.

"సేత ఎన్నముద్ద సెప్తాదేమో .. సెప్పిస్తరేటి మనవరాలి సేత" అని స్పెసల్రిక్వెస్టోటి పెట్టేడు సత్తిగోడు.

"ఎన్నముద్దా..?..ఎన్నముద్దలెవడిగ్గావాల గానీ.. ఇదిగో.. ఎలిపెంటెలగరుస్తదో మటుకూ సెప్తాది సూడు"అనివరహాల్రావు, మనవరాలి వైపు తిరిగి "ఇదిగో..సిన్నీ..ఎలిపెంటేటంటది?..ఎలగరుస్తాది? ..సెప్పు.." అన్నాడు. అదొకేల అరవకపోతే తనరవడానికి సిద్దవయిపోయి.

దానికేమో వుండుండి తిక్కలిపొచ్చింది. అడ్డంగా తలాడిస్తూ "నేన్చెప్ప.." అంది.

"పోనీ..అరవడవొద్దులే ..ఎలిపెంటెలగుంటదో మటుకూ సెప్పీ సూరుకో" అన్నాడు రాజీకొచ్చి.

"ఎలిపెంటా.. ఊఁ.. ఎలిపెంటుకేమో.. ..వన్ ట్రంకుంటాది.. ఇటుసైడూ అటుసైడూ బిగ్ బిగ్ ఇయర్సుంటాయి.." అంది. దాన్ని సగంలో ఆపి "ఎన్నుంటయి ఇయర్సు?" అని వో రెండు మార్కుల పెశినేసేడు వరహాల్రావు.

"ఎన్నా?.. టువ్వు!.. టువ్వుంటాయి" అందది.

సత్తిగోడికూరికే ఉండ బుద్ది కాలేదు. "ఇంగిలీసెలిపెంటు సరేగానీ.. మరి తెలుగెలిపెంటో? అదెలగుంటది?.." అన్నాడు నవ్వుతూ.

"నువ్వుండ్రా.. వోసే సిన్నీ మరైతే..మరి..ఆవెలగుంటదో సెప్తావేటి.." అనడిగేడు సిమ్మాద్రిమావ. అత్తెలీనట్టు మొహవెట్టింది.

"ఆవే..ఆవు" అన్నాడు వరహాల్రావు అందిస్తూ. అదింకా అనుమానంగా సూసింది.

"అదేనే.. కవ్వుంటాదీ..కవ్వూ.." అన్నాడు మళ్ళీ.

"వో.. కవ్వా.." అని కొంత సేపాలోచించి "చీ.. నేన్జెప్ప.." అనీసి సెంగుమని గెంతి, తుర్రుమని లోనకెలిపోయింది.

వరహాల్రావు ఆనందంగా అదెళ్ళిన వైపే సూస్తూ "ఇది కూడా అవెరికా ఎలిపోద్ది సుస్తూ వుండండి." అన్నాడు. అదవెరికా ఎలిపోడానికీ మేవు సూస్తూ వుండడానికీ సంబందవేటో నాకు తెలీలేదు.

"ముందు నువ్వెల్లిరా జాగరత్తగా!" అన్నాడు మావ.

ఎలిపోస్తూంటే తిరుగుటపాలో సత్తిగోడు సన్నగా పాడేడు,

"సెత ఎన్నముద్ద సెయిజారి పడిపోయె,
కొత్త కొత్త సాలీళ్ళు నెత్తిమీదికి పాకె.." అనీసి.

సిమ్హాద్రి మావ సుట్ట కాల్చుకుంటూ ముందు నడుస్తున్నాడు. సత్తిగోడికి లోపల ఎలగో వుంటేనే కానీ పైకి పాట్రావు. కదిపితే ఇలగన్నాడు.

"అదేలే.. మనకి బాగా నచ్చిన మడిసెవురైనా మన కళ్ళకెదురుగుంటానే మంచం మీద తీసుకోని, తీసుకోని సివరికి పోయినాడనుకో, ఆ మడిసిని బతికించుకోడం ఎలగో తెలీక సేతులు ముడుసుక్కూకోవాల్సొచ్చిందనుకో, ఎలగుంటదో గేపకానికొచ్చింది. మా బామ్మకలగే కదేటి అయ్యింది. మా బామ్మలాగే ఇయాల మన బాస కూడా మంచమ్మీద తీసుకుంటోందనీసి నాకనిపించి మనసు లోపల ఎవురో కెలికినట్టుగా వున్నాది." అన్నాడు.

"మీ బామ్మకి సచ్చీనాటికి తొంబయ్యుయిదు. అయినా అదేవైనా అర్దాంతరంగా, అష్టకష్టాలూ పడి పోయిందా ఏటి? నిద్దర్లో మారాణీలాగ పోయింది. దాంది సహజంగా సచ్చిన సావు. అలగే మన బాసది కూడా బలవంతం సావు కానంతవరకూ, దానికి పోయీ కాలం వొస్తే నువ్వాపినా ఆగదు. బాసేవైనా బరువు లాటిదేటి, బూవున్నంతకాలవూ వుండిపోడానికి." అన్నాను.

"అదేమరి సిక్కు .. మూడి సస్తందో, ముసిల్దయిపోయి సస్తందో ఎవుడూ గీత గీసి సెప్పలేడు కద బాస కాడికొచ్చీసరికి. సస్తందనీసి మటుకూ కాదన్లేవు. నా మట్టుకి నాకు దీనికి సావు కాసుక్కూకున్నట్టు లేదు, తోసుకొస్తున్నట్టుగా వున్నాది. మారాజు లాగ సచ్చినా, మునిసిపాలిటీ సెవం లాగ సచ్చినా, ఎలగసచ్చినా, సచ్చినోడు సొంతోడైతే బాదే కాదేటి మరి. అమృతం ఎతుక్కొచ్చి పొయ్యాలనీసి, అద్దొరికే వొరకూ అండగా వుండాలనీసి వుండకుండా వుంటాదేటి?

అయినా..అసలు మనబాసకేం తక్కువనీసిరా? వుండాల్సిన హంగులన్నీ వున్నాయే. సెళుకులూ, బెళుకులూ, వొయ్యారాలూ, వొద్దికలూ, వొహటేటి ..సమస్తకవూ వున్నయనీసి పంతులుగోరు సెప్పలేదా, మనకి తెలీదా..? కాకపోతే వొక్క తెలుగుతోనే రాజ్యాలెల్లేవనీసి వొప్పుకుంటాన్లే.. పైగా ఇయలా రేపూ రెండు మూడు బాసలు రాందీ బయిటికడుగెట్టలేకుండ వున్నావు. నిజవేను.. అలగనీసి కని పెంచిన బాసని కనికారం లేకుండా సంపేసుకుంటావా వుపయోగం లేదనీసి? దాన్ని వుపయోగించందీ అది నీకెలగుపయోగపడుద్ది సెప్పు?

కొత్త పదాల సంగతి దేవుడెరుగు, వున్న పదాలే వుపయోగించలేదనుకో ఇంక బాసకి వునికేటుంటది? వొక్కోసారి పరిస్తితుల్ని బట్టి వొక బాస ఇంకోబాసలోకి జొరబడిపోతాది. నువ్వడ్డలేవు కూడాను. స్కూటర్ని స్కూటరనే అనగలవు కానీ దానికి బదులు తెలుగు లో వోటి కనిపెట్టీసి, అందరూ అలగనకపోతే, ఆళ్ళకి సంకెళ్ళేసి జైల్లో తోసీమనీసి కాదు.

కాకపోతే అన్నం రైసైపోయి, కూర క్రరీ అయిపోన్నదనుకో, ఎంటనే ఆకలి హంగర్రైపోతాది. అడ్డీవోడెవుడు.. కొన్నాళ్ళకి గోంగూరా గొబ్బిళ్ళూ మటుకూ మిగిలిపోతయి హంపీ సిదిలాల్లాగ... మరి కొన్నాళ్ళకి గోంగూర గజగజలాడుతూ సూస్తా వుండగా.. దాని కళ్ళెదురుగానే... గొబ్బిళ్ళు కాస్తా గోబరు బాళ్ళయిపోతయి.. సివరగ్గోంగూర కేటవుద్దో నాకూహించ బుద్ది కాకుండా వున్నాది. ఇయాల బాస, రేపింకోటి.. ఇసయవేటంటే, అన్నం రైసూ, కూర క్రరీ అయిపోయినంత మాత్తరాన కడుపు నిండిపోదనీసి కాదులే.. నిండిపోద్ది.. కాన్నా బోటోళ్ళకి మాత్తరం మనసులో మటుకూ ఏదో వెలితిగుంటది. వోసారి మా బామ్మ కళ్ళక్కనిపిస్తాది. అంతేను..అంతకంటేటున్నాది? " అన్నాడు.
వొక్కోసారి సత్తిగోడు ఏదైనా సెప్పింతరవాత నాకు అన్డానికేటీ వుండదు. ఏదో అనాలనీసి నోరు తెరవాలగానీ, అన్డానికేటైనా వున్నాదనీసి కాదు. నేన్నోరు తెరవలేదు.

ఆర్నెల్లూ అయి పోయేయి. మొత్తానికి వరహాల్రావమెరికా నుండెలిపొచ్చి మూడ్నాలుగు వారాలయిందనీసి కబురు తెలిసింది. సూడ్డాని కెళ్ళమనీసి మావుత్తరం రాసేడు. వొస్తవా అంటే సత్తిగోడు రాననీసేడు. నేనెళ్ళేసరికి వరహాల్రావు హాల్లో వున్నాడు మనవరాల్ని వొళ్ళో పెట్టుకోని. జబ్బల్లోనూ, బుగ్గల్లోనూ కొంచెం కండా అదీ పట్టేడు. అమెరికావా మజాకావా అని నాలో నేనే అనుకున్నను. నన్ను సూడగానే సంతోషంగా రమ్మనాడు. సత్తిగోడు రాలేదా అనడిగేడు.

అదీ ఇదీ అయినాక, నేను వరహాల్రావు మనవరాలివైపు తిరిగి, "ఇదిగో..పిల్లా..కొత్త రైములేవేనా సెప్తావేటి? ఇనాలనీసున్నాది ..లల్లీపప్పిస్తా.." అని పప్పుని ముందే బేరానికెట్టేను.

వరహాల్రావు కలగచేసుకోని "రైవూ అదీ వొద్దు గానీ, వొసే పిన్నీ.. మొన్న నేర్వేను సూడు....అది సదువోసారి.." అన్నాడు.

ఎంటనే వరహాల్రావు మనవరాలు, "తొొన్నమునే కదాంతమును త్రొరపు బుజ్జయు.." అనీసి మొదలెట్టింది కావల్సిన సోట గుక్క తిప్పుకుంటూ. మద్య మద్య లో వరహాల్రావు అందించేడు.. అదయింతరవాత వేమనవి రెండు, సుమతీ సెతకం లో రెండు పద్యేలు.. పంచతంత్రంలోనుంచి వో కద.. మొత్తం నాకూహాకందకుండా వరహాల్రావూ, మనవరాలూ బలే తమాషా చేసేరు.

"ఏం..పిల్లా ఎప్పుడూ నేర్చేవియన్నీను..? సైంటేన్సు మానీసి సారదా బడికెలిపోతన్నావా ఏటి?" అనడిగేను..

"అచ్చి .. కాదే. సైంటేన్సేను.. అమెరికా నుంచొచ్చీసేక మా తాత నేర్పించేడు.. లల్లీపప్పేదీ మరి?..ఇస్తానన్నావు.." అని నిలదీసింది.

దానికో సాకిలెట్టిస్తే సంతోష పడుతూ లాక్కుని, టి.వి.లో గబ్బిలాయిమడిసి అనీసి ఇంగిలీసులో వోటొస్తాదనీ, అది సూడ్డానికనీసి తుర్రుమని లోపలికి పరిగెత్తుకోని పోయింది.
నేను వరహాల్రావు వైపు తిరిగి .."ఏమ్మావా.. నీ పనేనా ఇది.. పనికొచ్చే బాస మానీసి, పని కట్టుకోని, పనికిరాని సెత్తంతా నేర్పిస్తన్నవంటే .. నాకు నమ్మకం రాకుండా వున్నాది.." అన్నాను నవ్వుతాలుగా. "పరబాసని పనికొచ్చీబాస అనకురా.. పని గడుపుకోనీ బాస అను.. నీకూ నాకూ అదంతే. అందులో పుట్టి పెరిగినోళ్ళకి మటుకూ అదన్నిరకాలుగానూ వుపయోగ పడితే, దానివల్ల నాకు అసూయే కలిగింది. ఇహ మన బాసకొచ్చేవనుకో అది పనికొస్తాదా రాదా అని సొంతగా తేల్చుకోనీ అవకాశం సిన్నికందకుండా వుండిపోడం నాకు న్యాయంగా తోచలేదు." అన్నాడు మనవరాలి వైపు చూస్తూ.
నేనేం అనలేదు. ఎందుకో వరహాల్రావుది మంచసూయ గానే నా కనిపించింది.

వో వారవయ్యేక ఆ నోటా ఈనోటా ఇంటే తెలిసిందేటంటే, అవెరికా ఎలిపోయొచ్చిన కాడినుండి వరహాల్రావు పంతంగా మనవరాలికి తెలుగు నేర్పిస్తన్నడనీసి. సంగతేటంటే ఆర్నెల్లక్కడుండీ సరికి అక్కడోళ్ళు తెలుగుబాస పిల్లలకి నేర్పుకోడానికి పడే తంటాలూ అయిూ సూసేక, సత్తిగోడు సెప్పినట్టు మనసులో ఏదో కెలికీసినట్టయినాదట. పైగా తన కొడుకుండీ చోట తెలుగోళ్ళు తక్కువ్వల్ల, తెలుగు మాటాడీ మరో ఆసావీ దొరక్క తెగ వాచిపోయేట్ట. మొత్తానికి ఇంటికెలిపొచ్చేక, పారీసుకున్నదేదో ఎవురో తలుపుకొట్టి తెచ్చిచ్చినట్టు తెగ మురిసిపోయేట్ట.

ఇన్ని 'ట' లున్నా కూడాను, మొత్తానికి నాకు వరహాల్రావుని, తన మనవరాల్ని సూస్తే తెగ ముచ్చటగా మటుకూ వున్నాది. మొన్నోసారి ఎళ్ళీసరికి సిన్ని అమ్మాటాడుకుంటోంది. దాని అమ్మాట చూస్సరికి నాకనిపించింది, బాస మనకమ్మా మనం బాసకమ్మా అనీసి.. సత్తిగోణ్ణడగాలి! అడిగినా ఏటున్నాది, "రెండునూ.." అంటాడు ముక్క విరిచినట్టు.

ఆడికేవి.. దంచికొట్టినట్టు వో గంటసేపు వుపన్యేసవూ ఇవ్వగల్డు. దర్జాగా వో ముక్క లో కొట్టి పారీగల్డు. ఆడి బుర్రలోది సెప్పడానికి బాసనలగ వాడుకున్నడు మరి! అలాటోడికి అబిమానవుండకపోతే అది వార్తవుద్ది కానీ వుంటే ఏందుకవుద్ది

మొత్తానికి వరహాల్రావు సంగతి సత్తిగోడితో అంటే, "అయన్నీ నమ్మకులే.. సిమ్మాద్రి మావ సెప్పలేదూ.. వోసారో వారానికి వరహాల్రావు నరిసీపట్నం సెలవలకనీసి ఎళ్ళొచ్చి, తిరిగి రాగానే పెరట్లో కరివేపసెట్టుని కావులించుకోని బావురుమన్నాట్ట "ఎన్నాళ్ళయిందే..బాగున్నావా" అంటూ.. తరవాతి వారవే దాన్నరికించి పడీసేట్ట డాబా కడ్డవొచ్చిందనీసి. అంచేత ఇది వాపో బలుపో నిలకడ మీద కానీ తెనీదు.. తొందరపడిపోకు.." అన్నాడు.

నాకెందుకూ తొందర? వుంటే సత్తిగోడికే ఉండాల తొందర. మరాడే కద బామ్మా, బాసా అనీసి రెండు హెడ్డింగులు కొట్టీసి పట్టిగ్గేసేడు..!

అదీ సోది ఇయాల్టికి !
సిదివి కాటుకెట్టుకోనీలా సీకటవుతంది కానీ, ఇహ పోదాం, నెగండి.

   